

జిల్లా ఇన్‌ఛార్జి జెసిగా సూర్యతేజ

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న జెవి మురళీ సెలవుపై వెళ్లడంతో జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ బాధ్యతలను నరసాపురం సబ్‌కలెక్టర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యతేజను కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యతేజ

సాగునీటి కొరత లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పంట పొలాలకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టరేట్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రబీకి సంబంధించి ఇప్పటివరకూ రెండు లక్షల పదివేల ఎకరాల విస్తీర్ణంలో పంట నమోదు చేయడం జరిగిందన్నారు. వారాబంధి ద్వారా అన్ని ప్రాంతాల రైతులకూ నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వారాబంధి ద్వారా నీటి సరఫరాను పర్యవేక్షించేందుకు మండల, గ్రామస్థాయిలో వ్యవసాయ ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్డబ్ల్యుఎస్ తదితర శాఖల సిబ్బందితో కమిటీలు ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో తాగునీటికి మొదటి ప్రాధాన్యత, వ్యవసాయానికి రెండో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆక్వా సాగుకు మూడో ప్రాధాన్యతగా నిర్ణయించి నీటిని సరఫరా చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో నీటి సరఫరా పై ఇబ్బందులు పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలి

వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం ద్వారా కస్టమర్ హియరింగ్ సెంటర్‌కు సంబంధించిన గ్రూపులకు రుణాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇంకా 139 యూనిట్లు మంజూరు చేయాలని, వీటికి వచ్చేవారం నాటికి పూర్తి చేసేందుకు అయ్యేవిధంగా వ్యవసాయ అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 3,76,475 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ ధాన్యానికి రూ.770 కోట్లకు గాను రూ.730 కోట్ల చెల్లించామన్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 1,97,794 ఎకరాల్లో ఇ పంట నమోదు చేసినట్లు తెలిపారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూములను మత్స్యశాఖ అధికారులు సర్వే నిర్వహించారని తెలిపారు. సర్వే సక్రమంగా ఉందో లేదో అధికారులు తనిఖీ చేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎం.సూర్యతేజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వాటర్ రిసోర్స్ అధికారి పి.నాగార్జునరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్.సరోజ, తదితర అధికారులు పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాల వద్ద యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి శివరాత్రి ఏర్పాట్లపై ఉండి, భీమవరం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లు, పాలకొల్లు, ఆచంట, పెనుమంట్ర, నరసాపురం, భీమవరం తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీస్, ఫైర్, పంచాయతీ, మెడికల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఏర్పాట్లపై ముందుగా కార్యాచరణ రూపొందించుకుని పక్కగా అమలు చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ముందస్తుగా గుర్తించి ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు వేరువేరుగా పార్కింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు, పార్కింగ్ ప్రదేశాలను చూపిస్తూ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయాల పరిసర ప్రాంతాల్లో, పార్కింగ్ ప్రదేశాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. దర్శనాలకు ఎక్కువ సమయం క్యూలైన్లలో ఉండే అవకాశం ఉన్నందున, దర్శనం ముగించుకొని బయటికొచ్చే పసిపిల్లల తల్లులు, వృద్ధులు కొంత సమయం విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక కాబిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికుల రద్దీ దృష్ట్యా తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ, డిఎంఅండ్‌హెచ్‌ఒ మహేశ్వరరావు, డిపిఒ ఎం.నాగలత, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగిన సూర్యమిత్ర కార్మికుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అక్రమంగా కార్మికులను తొలగించిన సూర్యమిత్ర యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. సూర్యమిత్ర పరిశ్రమ వద్ద జరుగుతున్న దీక్షలకు ఆయన శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మిక చట్టాలు అమలు చేయలేని యాజమాన్యంపై ప్రభుత్వం, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇస్తున్న జీతభత్యాలను అర్థాంతరంగా తగ్గించడమే కాకుండా అడిగినందుకు కక్ష సాధింపుగా తొలగించడం చట్ట విరుద్ధమని విమర్శించారు. తక్షణం తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని లేని పక్షంలో అన్ని సంఘాలతోనూ కలిసి పెద్ద ఎత్తున పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బజారు రాగుడు బళ్ల ముఠా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ది భీమవరం ఏరియా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలిపిండి సత్యనారాయణ, సిఐటియు నాయకుడు అల్లూరి అరుణ్ పాల్గొన్నారు.



దీక్షలు ఉద్దేశించి మాట్లాడుతున్న వాసుదేవరావు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

భీమవరం :సూర్యమిత్ర ఆక్వా పరిశ్రమలో చట్ట వ్యతిరేకంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లో తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరం సూర్యమిత్ర ఆక్వా పరిశ్రమలో 15 సంవత్సరాల నుంచి పని చేస్తున్న డ్రైవర్లను ఏ కారణం లేకుండా అన్యాయంగా తొలగించిన యాజమాన్య చర్యలను ఖండిస్తున్నామని విమర్శించారు. అనేక ఏళ్ల నుంచి ఇస్తున్న టిఎ బిల్లులు ఏకపక్షంగా తగ్గించి వేతనాల్లో కొత్తపెట్టడంపై అడిగిన కార్మికులను విధుల నుంచి తొలగించడం చట్ట వ్యతిరేకమని విమర్శించారు. సమస్యపై పలుసార్లు యాజమాన్యంతో చర్చలు జరిపినా మొండిగా వ్యవహరించరని తెలిపారు. ఆక్వా పరిశ్రమల్లో కార్మిక చట్టాల అమలు విషయంపై జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడమే యాజమాన్యం మొండివైఖరికి కారణమని తెలిపారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ చట్టం ప్రకారం కార్మికులకు పనిగంటలు, జీతభత్యాలు ఇవ్వాల్సి ఉన్నా ఆక్వా యాజమాన్యాలు అమలు చేయకపోవడంపై జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే సూర్యమిత్ర కార్మికులను విధుల్లో తీసుకోకపోతే కార్మికులకు అండగా జిల్లాలోని అన్ని యూనియన్లు, కార్మికులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'చింత'లపూడి..!

నిధులలేమితో ముందుకు సాగని ఎత్తిపోతల పథకం పనులు

పరిష్కారంకాని భూసేకరణ సమస్యలు

అరకొరగానే పంప్‌హౌస్ పనులు

రూ.9,800 కోట్లకు పెరిగిన అంచనా విలువ

రాష్ట్ర బడ్జెట్‌లో నిధులిస్తేనే పనులు ముందుకు




ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ఎత్తిపోతల పథకం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఒకపక్క అంచనా విలువ పెరిగిపోతుండటంతో ఇప్పట్లో చింతలపూడి ప్రాజెక్టు పూర్తయ్యేనా అనే చర్చ రైతుల్లో పెద్దఎత్తున సాగుతోంది. మెట్టప్రాంతంలో రైతులకు అత్యంత మేలుచేసే సాగునీటి ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల పథకం. ఈ ప్రాజెక్టు 2008లో ప్రారంభమైంది. తొలుత రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.1,701 కోట్లు అంచనాలతో పనులు ప్రారంభించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించారు. దీంతో ప్రాజెక్టు అంచనా విలువ రూ.4,909.80 కోట్లుగా ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టు విస్తరణతో మరో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం 2018కి ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. ప్రాజెక్టు మాత్రం పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టుకు భూములిచ్చే రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరారు. రైతుల నుంచి పెద్దఎత్తున నిరసనలు సైతం వ్యక్తమయ్యాయి. గత ప్రభుత్వం రైతుల గోడు ఏమాత్రం పట్టించుకోలేదు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే చింతలపూడి ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని ప్రస్తుత సిఎం జగన్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ రైతులకు న్యాయం చేయని పరిస్థితి నెలకొంది. దీంతో చింతలపూడి మండలంతోపాటు పలుచోట్ల ఇప్పటికీ భూసేకరణ సమస్యలు పరిష్కారం కాని పరిస్థితి కొనసాగుతోంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టు పూర్తిగా పడకేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నత్తనడకన ప్రాజెక్టు పనులు

చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు గత మూడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సైతం సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ ఈ ప్రాజెక్టు పనులు 62 శాతం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. సుమారు రూ.నాలుగు వేల కోట్లు వరకూ ఖర్చు పెట్టారు. ఈ జిఎస్‌టి అమలుతో ప్రాజెక్టు అంచనా విలువ సైతం భారీగా పెరిగింది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4,980 కోట్లు నుంచి రూ.9,800 కోట్లకు చేరుకుంది. ప్రాజెక్టు ఆలస్యమవుతున్న కారణంగా బడ్జెట్ వ్యయం పెరిగిపోతుంది. 106 కిలోమీటర్ల మేర ఉన్న మెయిన్ కెనాల్ ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మరో రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే మెయిన్ కెనాల్ పూర్తి కానున్నట్లు తెలుస్తోంది. అది జరిగితే కొంతమేర రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. పంప్‌హౌస్‌కు సంబంధించిన పనులు సైతం అంతంతమాత్రంగానే జరిగాయి. చింతలపూడి ప్రాజెక్టు పనుల జాప్యం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. భూసేకరణకు సంబంధించి కోర్టు సమస్యలు సైతం 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే ఉన్నట్లు ఉండిపోయాయి. వైసిపి పాలనలో పూర్తిస్థాయి చివరి బడ్జెట్ త్వరలో ప్రవేశ పెట్టబోతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా చింతలపూడి ప్రాజెక్టుకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తారా అనే చర్చ నడుస్తోంది. ఈ ప్రాజెక్టును ఇప్పట్లో పూర్తి చేస్తారా అనే సందేహాలు సైతం రైతుల్లో నెలకొన్నాయి.



రైల్వే స్టేషన్ మాస్టారుకు వినతిపత్రాన్ని అంజేస్తున్న సిపిఎం నేతలు

రైల్వేలో రాయితీలు కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

రైల్వే ప్రయాణానికి గతంలో వివిధ తరగతులకు ఉన్న రాయితీలు కొనసాగించాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. అనంతరం స్టేషన్ మాస్టారు షేక్ కరీముల్లాకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో వివిధ తరగతుల వారికి ఉన్న రాయితీలు ఇవ్వాలని, స్టేషన్‌లో లిఫ్ట్ పెట్టాలని, ట్రెయిన్ స్థితిని తెలిపే డిస్‌ప్లే బోర్డులు పెట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వారికి రైల్వే ప్రయాణం తక్కువ ధరకు అందుబాటులో ఉంటుందన్నారు. గతంలో వృద్ధులు, మహిళలు ఇతరులకు ఉన్న రాయితీలు కరోనా తరువాత తొలగించడం అన్యాయమన్నారు. రాయితీలు ఉండటం వల్ల రైల్వేలో వెళ్లడానికే ప్రాధాన్యత చూపేవారని తెలిపారు. ఇప్పటికీ అన్ని ధరలు పెరిగిపోవడంతో ఏ ప్రయాణం అయినా పేదలకు భారం అయిపోయిందన్నారు. ఇటీవల పెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్లకు, బడా పెట్టుబడి దారులకు రాయితీలు, బ్యాంక్ రుణాలు రద్దు చేస్తున్నప్పుడు ప్రజలకు కనీసం రాయితీలు ఇవ్వలేరా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, డి.సీతారామయ్య, ఎ.అజయకుమారి, పి.దక్షిణామూర్తి, కె.నాగరత్నం, గుబ్బల గోపి, ధనలక్ష్మి, కె.మణికంఠ, కె.సోమఅంజన్, కె.మూర్తి పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

అల్లూరి సీతారామరాజు - భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బలరాం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని అల్లూరి సీతారామరాజు - భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బి.బలరాం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో వైద్య సహాయ కేంద్రం ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో వైద్య సహాయ కేంద్రం ద్వారా వందల మంది ప్రజలు వైద్య సహాయాన్ని పొందారన్నారు. వైద్య సహాయ కేంద్రంలో ల్యాబ్, ఇసిజి, 2డి ఎకో పరీక్షలతో పాటు జనరిక్ మందులు కూడా ప్రజలందరికీ అందుబాటులో ఉంటున్నాయన్నారు. ప్రజలకు సేవలందించడంలో వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు, మంతెన కృష్ణంరాజు, ఎస్ఎల్‌జి హాస్పిటల్స్ ఛైర్మన్ దండు శివరామరాజు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ జిఎస్.రాజు, పద్మరాజు ప్రత్యేక సహకారం అందించారన్నారు. కేంద్రం నిర్వహణకు పట్టణంలోని దాతలు ఎంతో సహకరించారన్నారు. కేంద్రం ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించిన మాజీ జిల్లా విద్యాధికారి, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజును సత్కరించారు. ఈ సేవా కేంద్రానికి పట్టణ ప్రముఖులు కొత్తపల్లి కోదండ రామ గాంధీ రాజు రూ. లక్ష, రైస్ మిల్లర్ సామంతపూడి సూర్యనారాయణ రాజు 100 కుర్చీలు ఇటీవల అందించారన్నారు. మైలా నాగయ్య వర్మ ట్రస్ట్ పేరుతో నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తున్నామన్నారు. నాగయ్య వర్మ కుటుంబ సభ్యులైన మైలా రామ్మూర్తి వర్మ, మైలా నాగార్జున వర్మ, సోదరుని కుమారుడు ప్రముఖ సీనియర్ అడ్వకేట్ రామాని రవీంద్ర ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. మాజీ జిల్లా విద్యాశాఖాధికారి, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన వైద్య సహాయ కేంద్రంలో వందలాది మంది సహాయం పొందారన్నారు. 10 మంది చిన్నారులకు శస్త్ర చికిత్సలు కూడా చేయించినట్లు తెలిపారు. ఈ నెల 26న బిపి, షుగర్, పక్షవాతం, ఫిట్స్‌కు సంబంధించి వైద్య శిబిరం నిర్వహించనున్నామని తెలిపారు. 28న గుండె పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మానవత సంస్థ విస్తరణ అభివృద్ధి రాష్ట్ర కన్వీనర్ జానకి రామరాజు మాట్లాడుతూ సంవత్సర కాలంగా ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు - భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధా కృష్ణ, ఎస్ఎల్‌జి హాస్పిటల్స్ మేనేజర్ వై.రణదేవ్, వైద్య సహాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎబిఎస్‌వికె కేంద్రం ఛైర్మన్ బలరాం

వైసిపి అంటేనే ప్రజాసేవ : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి అంటేనే సేవా భావంతో కూడుకున్న రాజకీయ పార్టీ అని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎఎంసి ప్రాంగణంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసిపికి మిగిలిన రాజకీయ పార్టీలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ప్రజలకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. కరోనా సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత పట్ల, ఆర్థిక భద్రత పట్ల ఎంత శ్రద్ధ తీసుకున్నారో ప్రజలందరూ గుర్తుంచుకున్నారన్నారు. లాక్ డౌన్ లో సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేశారని తెలిపారు. రెడ్‌జోన్‌లో సైతం ప్రజలకు వాలంటీర్ల ద్వారా, పార్టీ శ్రేణుల ద్వారా సేవలందించే విధంగా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు బాధ్యతగా పనిచేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, త్రీ టౌన్ జెసిఎ కన్వీనర్ చెల్లబోయిన సూర్య ప్రకాష్, వన్ టౌన్ జెసిఎ కన్వీనర్ నల్లం రాంబాబు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పండ్ల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 30వ వార్షికోత్సవం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో తట్టాగొట్టి పెద్దిరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. యూనియన్ సీనియర్ నాయకులు పెనుమాక నాగేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. 2022వ కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కార్యదర్శి కాయల ప్రసాద్ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్నుద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. దేశంలో అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశంలో 40 కోట్ల మంది అసంఘటిత కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దారుణమన్నారు. సమస్యలపై ఏప్రిల్ 5వ తేదీన రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు చేపట్టనున్న నిరసన, సభను జయప్రద చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా జవ్వాది శ్రీను, వైస్ ప్రెసిడెంట్ తట్టాగొట్టి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా గొర్రెల వంశీ, సహాయ కార్యదర్శిగా గొర్రెల అన్నవరం, కోశాధికారిగా పుట్టా యేసు, కమాండర్‌గా మద్దూరి ఆనంద్, కమిటీ సభ్యులుగా సువ్వాడ రాంపండు, సుంకర శ్రీను, బాసింశెట్టి శ్రీను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, ధనాల దానయ్య, పి.సురేష్, మెట్రెడ్డి రమణ, పైలు పైడియ్య, కుంచంగి నానాజీ, లాజరు, సిరపరపు రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక సమతా నగర్ రోడ్‌లో కాంటూర్ 5 దిగువున ఉన్న పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా చేస్తున్న నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం అధికారులను డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ గతంలో ఈ స్థలం కొల్లేరు కాంటూరు ఐదుకు దిగువున ఉందని, ప్రభుత్వ పోరంబోకు స్థలం అని తహశీల్దార్ ప్రకటించారని తెలిపారు. అక్కడ వేసిన అక్రమ లేఅవుట్లను ఆయన నిలుపుదల చేయిస్తామని తెలిపారన్నారు. అయితే అవి నోటిమాటలకే పరిమితమవ్వడంతో తిరిగి నేడు మరోసారి ఆ స్థలంలో నిర్మాణాలు ప్రారంభించారన్నారు. అధికారులు వారికి రాతపూర్వక నోటీసు అందజేసి అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంకి అప్పారావు, బి.వర్మ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం శ్రేణులు

20 నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమ సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫారం సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆచార్య ఎంజి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు లేబర్ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోనందున ఈ నెల 20వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు లేబర్ నిరవధిక సమ్మెలో భాగంగా ఈ సమ్మెను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజేటి సుధాకర్, ఎస్.నూకరత్నం, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజారోగ్యమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులు పున్నాని శివశక్తికి, మంచాల దానయ్యకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పేదల వైద్యం విషయంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరిట రాష్ట్రంలో ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రులతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో కూడా ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. వైద్యాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను జనాభా ప్రాతిపదికన ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

వ్యకాస మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పదో మహా సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నవుడూరులో మండల కార్యదర్శి బొప్పనపల్లి సూర్యచంద్రరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత విధానాలను శ్రమజీవులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధుల్లో కోత విధించడం అన్యాయమన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్రం ఉపాధి హామీకి కేటాయించిన బడ్జెట్‌ను సవరించి ప్రస్తుతం ఉన్న రూ.60 వేల కోట్ల బడ్జెట్‌ను రూ.2.40 లక్షల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైగాపుల రాంబాబు, కవురు సుబ్బారావు, జి.రాంబాబు, మైగాపుల త్రిమూర్తులు, మల్లుల సత్యనారాయణ, కిలాడి సత్యనారాయణ, తాళ్లూరి రాములు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - ఆచంట

చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. బాల్య వివాహాలను నిలుపుదల చేయాలనే అంశంపై కొడమంచిలి ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారామ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ బాల్య వివాహాలపై అవగాహనా కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల చిన్న వయసులో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొమ్మేటి రాంబాబు, స్కూల్ ఛైర్మన్ బొరుసు రాంబాబు, ఎఎన్ఎం పుష్ప రాజ్యం, ఆచంట, కొడమంచిలి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : చింతపర్రు జెడ్‌పి హైస్కూల్లో బాల్య వివాహాలపై విద్యార్థినులకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.సత్యవేణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, ఎంఎల్ఎ హెచ్‌పి కృష్ణవేణి, విఆర్ఒ నరసింహారావు పాల్గొన్నా రు.పూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవేణి బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డివి నరసింహారావు, అంగన్వాడీ టీచర్ కనకదుర్గ పాల్గొన్నారు.

పాలకోడేరు :బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా అనారోగ్యం బారిన పడతారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత, వైద్య సిబ్బంది ఎం.విజయప్రసాద్, వేదకుమారి అన్నారు. గొరగనముడి హైస్కూలులో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రంగం నాయుడు, ఐసిడిఎస్ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాలు చేసుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, సైన్స్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 23, 24, 25, 26వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభ విజయవంతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరంలోని దండు శ్రీనివాసరాజు అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25, 26వ తేదీల్లో కాకినాడలో రాష్ట్ర ద్వితీయ మహాసభ, అంతకు ముందు జిల్లాల మహాసభలను విజయవంతం చేశారన్నారు. అదే స్ఫూర్తితో జాతీయ మహాసభ విజయవంతం కావడానికి శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బొద్దు వెంకటేశ్వరరావు, నడింపల్లి హరినారాయణ, వాటాల రాంబాబు, మోకా వరమేశ్వరరావు, పెచ్చెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో గంజాయి వ్యాపారం చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.10 లక్షల విలువైన సరుకు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ వివరాలను వెల్లడించారు. గంజాయి ముఠాలో ప్రధాన నిందితుడు ఉండి నియోజకవర్గం పాలకోడేరు గ్రామానికి చెందిన మామిడిశెట్టి సుధాకర్‌ను, భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన పొనిపిరెడ్డి రాజశేఖర్‌ను, భీమవరం మండలం వెలివర్రు, (ప్రస్తుత నివాసం భీమవరం రెస్ట్ హౌస్ రోడ్ శంకర మఠం ఏరియా)కు చెందిన ఐజాక్ రాజున్న, భీమవరం నర్సాపు వీధి యనమ దుర్గ కల్యాణ గట్టుకు చెందిన దేవరపల్లి వంశీకృష్ణను, భీమవరం మారెళ్ళ వారి వీధి చింతల దొడ్డి ఏరియాకు చెందిన దుర్గారావు ప్రవీణ్‌ను, ఆకివీడు మండలం దుంపగడప గ్రామం తమ్మిరాజు కాలనీకి చెందిన కప్పల జేమ్స్‌ను సిఐ అడబాల శ్రీను, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ టి.గోవిందరాజులు శ్రీనివాస సెంటర్ ఓవర్ బ్రిడ్జి కింద శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఇద్దరిపై రెండు పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్క గంజాయి కేసులు ఉన్నాయని తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

మొగల్తూరు :మండలంలోని ముత్యాలపల్లిలో కోడిపందేల స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5,170 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్ట్

పెనుగొండ : వడ్డెపాలెం దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పెనుగొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నరసాపురం డిఎస్‌పి కె.రవిమనోహరాచారి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన అయ్యప్ప పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో గత నెలలుగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనాలు చేస్తుంటాడు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అయ్యప్పను శుక్రవారం ముక్కామలలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు..

రామేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



ఆచంటలో ఆలయం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఆచంట

మహాశివరాత్రి ఉత్సవాలకు రామేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. స్వామివారిని దర్శించుకునేందుకు యాత్రికులు ఇబ్బందులు పడకుండా ఆలయం చుట్టూ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సిద్ధాంతం జాతీయ రహదారి నుంచి 8 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆచంట రామేశ్వరస్వామి ఆలయం వరకూ తణుకు, నరసాపురం డిపోల నుంచి బస్సులు నడపనున్నారు. పెనుగొండ సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 50 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. యాత్రికులు స్వామివారిని దర్శించుకోవడానికి వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్‌విఎస్.రామచంద్ర కుమార్, దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు తెలిపారు. యాత్రికులకు ఐదు రోజులపాటు అన్నదానం నిర్వహించడానికి అన్నదాన కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం, బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో కూడా, యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆచంట వేమవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో రెండు తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యాధికారి పూజ తెలిపారు. ఈ ఉత్సవాలకు సుమారు 80 నుంచి లక్ష మంది యాత్రికులు పాల్గొంటారని తెలిపారు.

పాలకొల్లు: పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి వచ్చే యాత్రికుల కోసం పెద్దపెద్ద క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, మున్సిపల్ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, యునైటెడ్ కాపు సంఘం సారథ్యంలో యాత్రికులకు ప్రసాదం, మజ్జిగ, బాదంపాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ ఎస్ఐలు బాదం శ్రీనివాస్, ముత్యాలరావు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆలయ అధికారులు, సిబ్బందిని కోరారు. ఆలయ ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ఛైర్మన్ కోరాడ శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు

విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎఎస్ఐ బి.సత్యనారాయణ సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి తూర్పుతాళ్లలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల బారిన పడినా ప్రాణహాని ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

19న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్ సెంట్రల్లో ఈ నెల 19న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఓసూరి రాంబాబు తెలిపారు. ఓసూర్ వెంకటస్వామి నాయుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలు, చిన్నపిల్లలు, గుండె, మెదడు, నరాలు, నేత్రాలు, చర్మ సంబంధిత అనారోగ్య సమస్యలకు వైద్య పరీక్షల నిర్వహించి సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించనున్నామన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె మెయిన్ పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ శుక్రవారం సందర్శించారు. పాఠశాల విద్యార్థుల నోట్స్ బుక్స్, వర్క్ బుక్స్ తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం అమలు తీరు, మెనూ పరిశీలించి, భోజనాన్ని రుచి చూశారు. పాఠశాల ఉపాధ్యాయుల బోధన పట్ల, మధ్యాహ్న భోజన కార్మికుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మెకు తరలివెళ్లాలి

జిల్లా పరిశ్రమ శాఖ అధికారి ఆదిశేషు

ప్రజాశక్తి- భీమవరం

విశాఖపట్నంలో జరగబోయే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహికులు పెద్ద ఎత్తున తరలివెళ్లాలని జిల్లా పరిశ్రమ శాఖ అధికారి ఉయ్యాల ఆదిశేషు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని దేశాల నుండి పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం వివిధ పారిశ్రామిక వేత్తలతో పరిచయాలు, భవిష్యత్ ప్రయోజనాలకు దోహదపడతాయన్నారు. జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరుకు ముందుగా register.advantageap.in/#/gis-registration వెబ్ సైట్‌లో పేరును పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

పకడ్బందీగా భూముల రీసర్వే చేపట్టాలి

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని తహశీల్దార్ టిఎ కృష్ణారావు అన్నారు. కోలనపల్లి, ప్రాతళ్లమెరక గ్రామాల్లో భూములను సర్వే చేసేందుకు డ్రోన్ ఫ్లై శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్షా పథకంలో భాగంగా కీలకమైన డ్రోన్ సర్వే, ఆ తర్వాత దశల్లో జరిగే క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ, గ్రౌండ్ వాలిడేషన్ వంటి పనులు సాగాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విజయకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రామానుజన్ మ్యాథ్స్ పరీక్షల్లో ఉల్లంపర్రు సబితా జూనియర్ కాలేజ్ విద్యార్థిని దాసరి విజయ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. విజయను ఇంటర్మీడియట్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ శేఖర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కాలేజ్ కరస్పాండెంట్ మద్దాల వాసు మాట్లాడుతూ అత్యుత్తమ విద్యా బోధనతో ఈ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. విజయను డాక్టర్ బాబ్జి, మద్దాల రాంప్రసాద్, వసంత లక్ష్మి అభినందించారు.

రీ సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్

భీమవరం :రీ సర్వే పనులు వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రీ సర్వే పనులు జిల్లాలో డ్రోన్ ఫ్లేయింగ్ అయిన గ్రామాల్లో చేయాల్సిన పనులు, వ్యాలిడేషన్, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లపై కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా ప్రతి అడుగు ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయాలన్నారు. ప్రతి రైతు భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయాలన్నారు. రీ సర్వే టీములు భూమి వద్దకు వచ్చినప్పుడు ప్రతి రైతు, భూ యజమాని హాజరై వారి భూ సరిహద్దులు రీ సర్వే టీమ్‌కు చూపించి సర్వేకు సహకరించాలన్నారు. నిర్ణీత సమయంలోగా భూ రీ సర్వే పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, డిఆర్ఒ కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండలోని ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. అనంతరం ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

నరసాపురం :ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు అన్నారు. రుస్తుంబాద గాదివారితోటలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుని మాట్లాడారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతోందన్నారు. మద్యపానాన్ని విడతలవారీగా నిషేధిస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వాతాడి ఉమా మహేశ్వం రావు, ఆనందబాబు, నవరత్నం, కుమారస్వామి పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఉండి

తెలంగాణ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు వేడుక మండలంలోని వెలివర్రు గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షులు దండు వీర వెంకట సుబ్బరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెలివర్రు గ్రామ దేవత వీర పేరంటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని సుమారు 500 మంది మహిళలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాతీయ స్థాయిలో ప్రభుదాస్, కృష్ణ ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

యునైటెడ్ కాపు క్లబ్ సభ్యులు గుణ్ణం ప్రభుదాస్, ముద్దాడ కృష్ణలు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో జాతీయస్థాయిలో జరిగిన షటిల్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానం పొందారు. జాతీయ స్థాయిలో విజయం సాధించి, పాలకొల్లు పట్టణానికి, యుకెఎస్‌సి క్లబ్‌కి అత్యంత గౌరవం తెచ్చిన ప్రభుదాస్, కృష్ణలను పలువురు అభినందించారు. వీరు మరిన్ని విజయాలు సాధించాలని, అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి విజయాలు సాధించాలని క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచర్ల సంజయ్, అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, కార్యదర్శి జక్కంపూడి మదన్, కోశాధికారి కానూరి ప్రభాకర్ అభినందించారు.

చందపర్రులో 'ఇదేం ఖర్మ'...

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చందపర్రు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్ఎ డాక్టర్ నిమ్మల రా మానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి హయాంలో రూ.69 కోట్ల ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ ద్వారా నిధులు మంజూరు చేసి మేడపాడులో శంకుస్థాపన కూడా చేసి మెగా ఇంజినీరింగ్ కంపెనీకి టెండర్లు ఇచ్చి వర్క్ ఆర్డర్ ఇస్తే మొదలైన పనులను కూడా వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపివేశారన్నారు. దీంతో చందపర్రు గ్రామస్తులు నీళ్లు కొనుక్కుని తాగేటువంటి పరిస్థితి వచ్చిందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల సత్తా

తణుకు :విజయనగరం జిల్లా పార్వతీపురంలో ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీలో తమ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచారని స్థానిక మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాష్‌రావు తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్ 14 ఇండియన్ రౌండ్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.గాయత్రీవల్లి బంగారు పతకాన్ని సాధించిందన్నారు. అండర్ 17 విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని ఎన్.హంసని బంగారు పతకం, కె.లీనా సహస్ర రెడ్డి కాంస్య పతకాన్ని సాధించారని చెప్పారు. ఎం జాహ్నవి, ఎస్.సంతోష్ పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా ఉత్తమమైన శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.

తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సెంటినెల్ సర్వేలెన్స్ ల్యాబ్ (డెంగీ వ్యాధి నిర్ధారణ ల్యాబ్)ను జోనల్ మలేరియా నివారణ అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, ల్యాబ్ టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం కృష్ణుడు ఆలయం వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ కాలేజీ మహిళా హాస్టల్‌ను పరిశీలించారు. ఇరగవరం రోడ్డులో, ఇంద్రయ్య నగర్ సచివాలయం ఏరియాలలో డ్రైడే కార్యక్రమాన్ని సబ్‌యూనిట్ పరిధిలో జి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ టీమ్ టెక్నికల్ సభ్యులు ఎస్.రవిశేఖర్, జె.సతీష్, ఎస్‌వి.ప్రసాద్, మౌనిక, రాజకుమారి పాల్గొన్నారు.

'బిసిలకు ఎంఎల్‌సి సీటు కేటాయించాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఎంఎల్‌సి సీటు గౌడ సంఘీయులకు కేటాయించాలని పలువురు కోరారు. ఈ మేరకు మండలంలోని దిగమర్రు గ్రామంలో గౌడ సంఘీయులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు లక్షలకు పైగా, రాష్ట్రంలో 35 లక్షలకు పైగా ఉన్న గౌడ వర్గానికి న్యాయం చేయాలన్నారు. గతంలో గౌడ కులస్తులకు రెండు ఎంఎల్‌సి సీట్లు ప్రభుత్వ విప్ కలిగి కేటాయించారన్నారు. గౌడ సంఘీయుకు న్యాయం చేయాలని కోరారు.

పాలకొల్లు మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన చింతన నేషనల్ ఒలింపియాడ్స్‌లో సైన్సు, ఇంగ్లీష్ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్‌పిఎస్.ప్రకాష్ తెలిపారు. విద్యార్థులకు రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఐఐటి ఫౌండేషన్, ఇ-లెర్నింగ్, ఒలంపియాడ్స్ కోచింగ్ వంటి వివిధ అంశాల పట్ల శ్రద్ధ తీసుకుని ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ప్రతి సంవత్సరం తమ స్కూల్ విద్యార్థులు క్రమం తప్పకుండా రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకుంటున్నారని స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ కెవి.కృష్ణ వర్మ అన్నారు. సైన్స్ ఒలింపియాడ్‌లో బి.హిమసత్యశ్రీరాం రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఎల్.భార్గవ సత్యసాయి ద్వితీయ బహుమతి సాధించారు. సిహెచ్.శిరీష్ నాలుగో ర్యాంకు, ఎం.మనోహరి తొమ్మిదో ర్యాంకు సాధించారు. ఎస్.హేమశ్రీ జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో, ఎస్.జైరున్నీషా ద్వితీయ, పి.జ్యోతిశ్రీ తృతీయ స్థానాల్లో నిలిచారు. ఇంగ్లీష్ విభాగంలో ఎన్.సాయివర్మ రాష్ట్రస్థాయిలో ఫస్ట్, ఎన్.కీర్తిశ్రీ సెకండ్, ఎం.సంధ్య జిల్లాస్థాయిలో ఫస్ట్, కె.డైసీ సెకండ్, ఎస్.అక్షర థర్డ్ ర్యాంకు సాధించారు. వీరిని అకాడమీ సెక్రటరీ కెవి.కృష్ణవర్మ అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చింతన ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు అందించిన, మెరిట్ సర్టిఫికెట్లను, మెడల్స్‌ను బహుకరించారు.

20 వరకు రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు గ్రామం నుంచి కుముదువల్లి మీదుగా భీమవరం వెళ్లే రహదారిలో కుముదువల్లి వద్ద ఉన్న రైల్వే గేటును ఈ నెల 20 వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు గేటు సమీపంలో చిన్న ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ రైల్వే గేటును శుక్రవారం ఉదయం నుంచి మూసి వేశారు. రైల్వే అధికారులు గాని, రెవెన్యూ సిబ్బంది గాని పత్రికలకు ముందస్తుగా సమాచారం అందించకపోవడంతో ప్రయాణికులకు గేటు మూస్తున్నారని సమాచారం తెలియక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. రైల్వే మరమ్మతుల కారణంగా ఈ నెల 20వ తేదీ వరకు గేటును మూసివేస్తున్నట్లు చిన్న ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో ఆ ఫ్లెక్సీని చూసి వాహనదారులు వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు రంగం నాయుడు అన్నారు. మోగల్లు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగంనాయుడు గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

విస్సాకోడేరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. విద్యార్థుల ఎత్తు, బరువులతోపాటు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేశారు. పలువురు విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కె.శ్రీనివాస్, నాగమణెమ్మ, లలిత, వాణి పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూలులో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం సభ్యులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆపద సమయంలో ప్రజలు, అధికారులు తీసుకోవాల్సిన కనీస చర్యల గురించి వివరించారు. పాఠశాల భద్రతతో ఏదైన లోపం, ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, వరదలు, తుఫాన్లు, సునామీలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి దృశ్యరూపంగా ప్రదర్శించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

ఉండి :ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అర్తమూరు గ్రామ సచివాలయ ఎఎన్ఎం సావిత్రి పిలుపునిచ్చారు. శుక్రవారం అర్తమూరు సచివాలయ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం సావిత్రి మాట్లాడుతూ మురుగునీరు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు.

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టులో
E.P.No. 5/2021
O.S.No. 66/2017

Between:
టి.అర్జునరావు ...డి. హెచ్. ఆర్
AND
టి.భగవాన్ ...జె.డి.ఆర్

పై నెంబరు వారంటు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టులో **ది.13-03-2023న ఉదయం 10:30 ని॥ల నుండి బహిరంగ వేలం వేయబడును.** కావున కావలసిన వారు సదరు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

ప॥గో॥జిల్లా, భీమడోలు ఎస్.ఆర్.ఓ., భీమడోలు గ్రామం, ఆర్.ఎస్.నెం. 62/3బి, లో 101 చ॥గ॥ హౌస్ సైట్ 13వ బ్లాక్‌నకు హద్దులు:

East: Site Of Ghanta Ramu to some extent & Road to some extent.
South: Road.
West: Site of Vangalapudi Gotiyya.
North: Site of Thummagunta Geevan Prasad.
D.H.R. Value : Rs.3,00,000/-
Ammin Value : Rs.6,50,000/-
Sale on : 13-03-2023.

D.S.V.MANIKYALA RAO
Advocate, Power Pet,
Eluru. Cell: 94401 11466

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 605/2021

Between:
బొద్దుల బంగారయ్య -వాది
మరియు
బొక్కా వరప్రసాద్ -ప్రతివాది

ప్రతివాది: బొక్కా వరప్రసాద్, తండ్రి: కృష్ణమూర్తి, హిందూ, పురుషుడు, ఇంటి నెంబరు: 1-48, పాలంగి, ఉండ్రాజవరం మండలం.

పై నంబరు దావా నందు ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా అందుకుని యుండుటలేదు. కాబట్టి పై కోర్టు వారి ఎదుట **ది. 20-02-2023 ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయతు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి పై దావా నందు మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానం చేయబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

గాజుల వీర వెంకట అప్పాజి
సుంకర విజయ్‌కుమార్
తణుకు వాది తరపు న్యాయవాదులు
05-2-23 తణుకు, సెల్:9948809596

In The Court Of The Hon'ble First Additional Junior Civil Judge :: Eluru :: W.G.Dist
I.A.No. 206/2022
in O.S.No. 208/2022

Between:
Sri Muddana Leela Ram ***...Plaintiff***
AND
Sri Bethapudi Govinda Raju ***...Defendant***

పై నెంబరు దావాలో రెస్పాండెంటు /డిఫెండెంట్ అయిన Sri Bethapudi Govinda Raju, S/o. Babu Rao, Hindu, Male, aged 38 Years, Resident of D.No. 5-94, Vempadu Village, Pedapadu Mandal, W.G.District అను మీకు చాలాసార్లు ఐ.ఎ.నెం. 206/2022 నందు మీకు సంబంధించిన దావా దాఖలా షెడ్యూలు స్థిరాస్తిని Attachment Before Judgement చేయుటకు, నోటీసులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికిని అమలు కాలేదు. కావున సదరు కేసు **ది.09-03-2023 నాటికి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు మీరు ఉదయం గం॥10:00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపర్చడమైనది.

(ది.08-02-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ,
ఏలూరు, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడరు,
10-2-23. ఏలూరు. సెల్: 94401 11033

In The Court Of The Hon'ble First Additional Junior Civil Judge :: Eluru :: W.G.Dist
I.A.No. 206/2022
in O.S.No. 208/2022

Between:
Sri Muddana Leela Ram ***...Plaintiff***
AND
Sri Bethapudi Govinda Raju ***...Defendant***

పై నెంబరు దావాలో రెస్పాండెంటు /డిఫెండెంట్ అయిన Sri Bethapudi Govinda Raju, S/o. Babu Rao, Hindu, Male, aged 38 Years, Resident of D.No. 5-94, Vempadu Village, Pedapadu Mandal, W.G.District అను మీకు చాలాసార్లు ఓ.ఎస్.నెం. 208/2022 నందు దావా బాకీ రాబట్టుకొనుటకు, దావా సమనులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికిని అమలు కాలేదు. కావున సదరు కేసు **ది.09-03-2023 నాటికి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు మీరు ఉదయం గం॥10:00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపర్చడమైనది.

(ది.08-02-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ,
ఏలూరు, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడరు,
10-2-23. ఏలూరు. సెల్: 94401 11033